## క్లుప్తంగా

### జిల్లా డైరీతో ప్రజలకు ఎంతో ఉపయోగం



నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా డైరీని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగానున్న రెవెన్యూ, పోలీస్ అధికారుల సమాచారంతో పాటు నరసరావుపేటలోని హాస్పిటల్స్, వైద్యుల వివరాలతో కూడిన జిల్లా డైరీ జిల్లా ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం డైరీని రూపొందించిన సెయింట్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, న్యాయవాది వంకాయలపాటి రవి, తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. డైరీ రూపకల్పనకు సహకరించిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఐ అండ్ పీఆర్ డీడీ ఎ.ఎస్.దీప్తి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.బాలు నాయక్ పాల్గొన్నారు.

### క్రికెటర్ రషీద్‌కు సత్కారం



నరసరావుపేట ఈస్ట్: భారత అండర్–19 క్రికెట్ టీం వైస్‌కెప్టెన్, అండర్–19 వరల్డ్ కప్ విన్నర్ షేక్.రషీద్ బుధవారం తాను చదువుతున్న ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాలను సందర్శించాడు. కళాశాలలోని ఏపీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నూతనంగా నిర్మించిన డ్రస్సింగ్ రూంలను పరిశీలించాడు. అనంతరం జీబీఆర్ క్రికెట్ అకాడమీ నెట్స్‌లో ప్రాక్టీస్‌చేస్తున్న క్రీడాకారులకు బ్యాటింగ్ మెలకువలను తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమ రావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కాగా కళాశాలకు వచ్చిన క్రికెటర్ రషీద్‌ను కేబీఆర్ కళాశాల డైరెక్టర్ కంచర్ల నరేంద్ర, ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో జీబీఆర్ క్రికెట్ అకాడమీ కోచ్‌లు పఠాన్ భాషా, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఘనంగా వార్షికోత్సవం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని శంభునిపాలెంలో కొలువైయున్న శ్రీ కోదండరామస్వామి దేవస్థాన 16వ వార్షికోత్సవ అష్టబంధ మహా మహాసంప్రోక్షణ వేడుకలు బుధవారం రెండో రోజు వైభవంగా జరిగాయి. మంగళవారం తొలిరోజు గోపూజ, విశ్వక్‌సేన పుణ్యావాచనం, అఖండ దీపస్థాపన, మహాపూజ, శాంతిహోమం, కుంభకళావాహన, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. 24న శాంతి కళ్యాణం, 25న ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

### ఖోఖో పోటీలకు గుడ్‌షపర్డ్ విద్యార్థి

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వినుకొండలోని గుడ్‌షెపర్డ్ స్కూల్ విద్యార్థులు డి.కిరణ్‌కుమార్, యు.నాగరాజు గుంటూరు జిల్లా ఖోఖో టీమ్ తరపున ఆడి ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జి.ఇన్నారెడ్డి తెలిపారు. స్థానిక గుడ్‌షపర్డ్ పాఠశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన డి.కిరణ్‌కుమార్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. అదేవిధంగా అండర్ – 14 విభాగంలో జిల్లా తరపున ఆయా విభాగాల్లో తమ పాఠశాలకు చెందిన మరికొంతమంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.లక్ష్మీసునీత, డైరెక్టర్లు మంజులరెడ్డి, మదన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు పి.ఆజీమ్, నాగరాజు, జె.వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులు చేయూతతో అభివృద్ధి పనులు చేపట్టటం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నాయకులు మక్కెన మల్లిఖార్జునరావు అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లోని కళావేదిక ప్రారంభోత్సవం కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలా దిశ్రీనివాసరావు సారథ్యంలో సహచర ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.జె. రమేష్, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, అబ్దుల్లా, నిర్మల, శ్రీకాంత్ ఉన్నారు.

### చైతన్యంతోనే సామాజిక రుగ్మతలకు స్వస్తి

యడ్లపాడు: పాఠశాలలో విద్య ఒక్కటే కాదని నేటి సామాజిక పరిస్థితులపై కూడా అవగాహన విద్యార్థులు కల్పించుకోవాల్సిన అవసరం ఉందని ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కె వెంకటేశ్వరరావు చెప్పారు. కొండవీడులోని ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లలకు, మహిళలకు బుధవారం సురక్షిత గ్రామజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరుకు చెందిన మైభాయిస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్‌సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అవగాహన సదస్సుకు స్కూల్ హెచ్ఎం జి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

# రైతులకు పూర్తిస్థాయిలో అండగా ఉన్నాం

**వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని**



లబ్ధిదారులకు కరపత్రం అందజేస్తున్న మంత్రి రజిని

చిలకలూరిపేట: రైతులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం అండగా ఉంటున్నదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. మంత్రితో గ్రామస్తులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి మాకు ఎంతో మేలు చేస్తున్నారు.. జీవితాంతం ఆయన వెంటే ఉంటామంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల కాలంలో 50 లక్షల మందికి పైగా రైతులకు రూ. 20 వేల కోట్లకు పైగా నిధులను వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద అందజేసినట్లు చెప్పారు. వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాల కింద 65.63 లక్షల మంది రైతులకు రూ. 1218 కోట్లు ఇప్పటివరకు తమ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. పంటల బీమా ద్వారా 31లక్షల మంది రైతులకు రూ. 3,788 కోట్లు అందజేసిన గొప్ప ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు దగాకు గురయ్యారని, టీడీపీ ఐదేళ్ల పాలనలో అన్నదాతలు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని ఈ రాష్ట్రంలోని రైతులు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. అన్నదాతలతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటూ అండగా ఉంటున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మురికిపూడి గ్రామ సర్పంచ్ ఉసర్తి భూలక్ష్మి, జీడీఎంఎస్ డైరెక్టర్ ఆరుమళ్ల వెంకట శివ, ఎంపీటీసీ సభ్యుడు జమ్మలమడుగు సూర్యప్రకాశరావు, నాయకులు గుత్తా వేములయ్య, సూరబోయిన ఆదిలక్ష్మి, మురళి, రాంబాబు, జాష్టి పార్వతి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంబంధం ఉంటే నిరూపించండి

- టీడీపీలో అంతర్గత పోరు, చేతగానితనం వల్లే కోటిరెడ్డి హత్య
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రొంపిచర్ల మండల టీడీపీ నాయకుడు వెన్నా బాలకోటిరెడ్డి హత్యలో తనకు గాని, మండల వైఎస్సార్‌సీపీ నాయకులకు గాని ఎటువంటి సంబంధంలేదని, ఉంటే సాక్ష్యాధారాలతో సహా నిరూపించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. దీనిపై ఎటువంటి చర్చకైనా తాము సిద్ధమేనని, మా తప్పుందని నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా వెనుకాడబోమని చాలెంజ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీల కు ఇచ్చిన ప్రాధాన్యం, బాలకోటిరెడ్డి హత్యలో టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ మాట్లాడారు. బాలకోటిరెడ్డిపై దాడి చేసిన పమ్మి వెంకటేశ్వరరెడ్డి టీడీపీకి చెందినవాడు కాబట్టే సంఘటన అనంతరం పార్టీ నుంచి సస్పెండ్ చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. హత్యలో పాల్గొన్న వెంకటేశ్వరరెడ్డి వాట్సాప్ ప్రొఫైల్ పిక్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ అరవింద్‌బాబు ఫొటో పెట్టుకోవడం ద్వారానే అతనే పార్టీనో వెల్లడవుతుందన్నారు. తుపాకీ కాల్పుల్లో గాయపడ్డ బాలకోటిరెడ్డికి ముందునుంచే మంచి హాస్పిటల్‌లో వైద్యం అందించి ఉంటే బ్రతికేవాడని, హత్య జరిగి 20రోజులు గడిచిన మెరుగైన చికిత్స ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. అరవిందబాబు ఇకనైనా బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి హెచ్చరించారు. కాగా రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయాల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఉంటూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు కారుమంచి మీరావలి, మాడిశెట్టి మోహనరావు, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల, ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వినుకొండ పర్యటనలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం ముస్లిం మైనార్టీ గురుకుల స్కూల్, కాలేజీ, 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ఆయా శాఖలకు సంబంధించిన జిల్లాస్థాయి అధికారులతో కలిసి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం పట్టణంలోని స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వినుకొండ ప్రాంతంలోని ముస్లింల పిల్లలు చదువుకునేందుకు ముస్లిం మైనార్టీ గురుకుల స్కూల్, కాలేజీ నిర్మాణం దోహదపడుతుందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిర్మాణానికి అవసరమైన రూ.10 కోట్లు నిధులను మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కాలేజీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల వక్ఫ్ బోర్డు ల్యాండ్‌ను పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే 100 పడకల ఆసుపత్రి నిర్మించడం ద్వారా వినుకొండ నియోజకవర్గంతో పాటు ప్రకాశం జిల్లా పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధునిక మౌలిక సదుపాయాలతో కూడిన హాస్పటల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల వైద్యసేవలు అందించడంలో రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి రూ.15 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

**జన్మభూమి రుణం తీర్చుకోవటం దేవుడిచ్చిన వరం**

శావల్యాపురం: జన్మభూమి రుణం తీర్చుకోవటం దేవుడిచ్చిన వరమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామంలోని దాతలు ఇచ్చిన 30 సెంట్లు స్థలంలో రూ. 80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనాలు గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్ భవన సముదాయాలతో పాటు గ్రామంలో 3 కిలోమీటర్ల మేర రూ.2 కోట్ల 85 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో స్థల దాతలు సాదినేని చినవెంకయ్య, గ్రామవాసీ ప్రముఖ వైద్యనిపుణులు డాక్టరు పురేటి భారతి, పారా వెంకయమ్మ సహకారం మరువలేమని, ప్రత్యేకంగా పూలమాలలతో దుశ్శాలువాల తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ మారాసు రామయ్య, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, ఎంపీపీ ముండ్ల మూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకటరావు, కంచుమాటి అజయ్, బ్రహ్మచారి, ఎంపీటీసీలు లింగా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తూమాటి క బ్బారావు, ముండ్రు సాంబశివరావు, రాఘవరావు, చెన్నంశెట్టి శ్రీనివాసరావు, (సీఎస్ఆర్) రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షులు కర్జా శ్రీనివాసరావు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమం దరిచేరాలి

**ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు**



కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి నవరత్నాల్లో భాగంగా కరపత్రాల ప్రజలకు అందజేసి సమస్యల అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వేల్పూరు గ్రామంలో ఎన్నెస్పీ కాలువ పక్కనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు. అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకట్రావు, ఉప సర్పంచ్ మారాసు రామయ్య, తూమాటి కబ్బారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వేపై జేసీ అసంతృప్తి



కేజీబీవీలో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న జేసీ శ్యాంప్రసాద్

ఈపూరు: మండలంలోని భూ రీసర్వే నిర్వహణ పట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వే అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రీ సర్వే పనులు వేగంగా జరగకపోవడానికి గల కారణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఈపూరు, బొమ్మరాజుపల్లి, గుండేపల్లి, చిట్టాపురం, కొండాయపాలెం, కొండ్రముట్ల, దాసులపల్లి గ్రామాలకు ఓఆర్ఐ మ్యాప్ వచ్చిందని తెలిపారు. భూ రీసర్వే పనుల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి రైతులకు భూహక్కు పత్రాలు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ముందుగా స్థానిక కేజీబీవీ పాఠశాలను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయినీల హాజరు రిజిస్టర్, విద్యార్థినుల హాజరును పరిశీలించారు. మోనూ ప్రకారమే విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు సబ్జెక్ట్ ప్రశ్నలను అడిగి విద్యాబోధనపై పలు సూచనలు చేశారు.

# స్పోర్ట్స్‌డెక్ ప్రారంభం



స్పోర్ట్స్ డెక్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: చిలకలూరిపేట రోడ్డు ఎస్ఆర్‌కేటీ జంక్షన్‌లో ఆధునిక హంగులతో క్రీడాకారులకు ఉపయోగపడేలా నిర్మించిన స్పోర్ట్స్‌డెక్ కాంప్లెక్స్‌ను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, అండర్–19 భారత జట్టు క్రికెట్ వైస్ కెప్టెన్ షేక్ రషీద్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ నరసరావుపేటకు ఇటువంటి క్రీడా మైదానాలు ఎంతో అవసరమన్నారు. దీనికోసం కృషి చేసిన కంజుల ప్రవంత్‌ను అభినందించారు. క్రికెట్ కోర్టును క్రికెట్ క్రీడాకారుడు రషీద్ ప్రారంభించగా షటిల్, వాలీబాల్, ఫుట్‌బాల్ మైదానాలను డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, పొడా చైర్‌పర్సన్ మిట్టపల్లి రమేష్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఎ.హనీఫ్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి ప్రారంభించారు. ఐపీఎల్ చెన్నైకు ఎంపికై ధోనీ ఆధ్వర్యంలో ఆడుతున్నందుకు రషీద్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అభినందించారు.

## అమ్మవారి దర్శన వేళల్లో మార్పు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో మరమ్మత్తులు నిర్వహిస్తున్నందున అమ్మవారి దర్శన వేళల్లో మార్పులు చేసినట్టు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ గర్భాలయం, అంతరాలయంలో మరమ్మత్తుల దృష్ట్యా ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకే భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని తెలిపారు.

## అమీన్‌సాహెబ్‌పాలెం ప్రభకు గ్రామోత్సవం

నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండకు తరలివెళ్లి తిరిగి స్వగ్రామాలకు చేరిన అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ ప్రభకు బుధవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. 90 అడుగుల ఎత్తు గల భారీ ప్రభలు 14 కిలోమీటర్ల తిరుగు పయనం సాగించి స్వగ్రామానికి రావటంతో గ్రామస్తులు రెండో దఫా ఉత్సవం జరిపారు. ఒక్కో ప్రభ నిర్మాణానికి రూ.30 లక్షల మేర ఖర్చు చేసి మహాయజ్ఞంలా జరపటం విశేషం. శివరాత్రి వేడుకకు గ్రామం నుంచే కాక పలు గ్రామాల నుంచి ప్రజలు, విదేశాల్లో స్థిరపడిన వారంతా స్వగ్రామానికి చేరారు.

## కప్పగంజి వాగులో యువకుడి గల్లంతు

చిలకలూరిపేటటౌన్: రాజమండ్రి ప్రాంతానికి చెందిన యువకుడు కుప్పగంజి వాగులో స్నానానికి దిగి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మండలం ఉప్పంపేట గ్రామానికి చెందిన నూకల సాయికుమార్ (28) జామాయిల్ కర్ర లోడు కోసం లారీ డ్రైవర్‌తో కలసి చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామానికి మంగళవారం వచ్చాడు. సాయంత్రం సమయంలో కమ్మవారిపాలెం–గోవిందపురం మధ్య నున్న కుప్పగంజి వాగులో దిగి గల్లంతయ్యాడు. వాగు ప్రవాహం తక్కువగా ఉన్నా, రైతులు తమ పొలాలకు నీళ్లు పెట్టుకొనేందుకు ఏర్పాటు చేసిన గోతిలో పడి మృతి చెందాడు. సాయి లారీ ఓనర్ సోమరాజు స్వయాన తమ్ముడు. క్లీనర్ లేకపోవటంతో డ్రైవర్‌కు సహాయకుడిగా వచ్చి ప్రమాదంలో చిక్కుకున్నాడని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యా ప్రమాణాలకు పునాదివేసిన డాక్టర్ ఆజాద్

- పార్టీ కార్యాలయంలో ఘనంగా వర్ధంతి
- హాజరైన ఎమ్మెల్యే గోపిరెడ్డి, మైనార్టీ నాయకులు



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: దేశంలో తొలి విద్యాశాఖామంత్రిగా విద్యాప్రమాణాలకు పునాది వేసిన వ్యక్తి భారత రత్న డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కీర్తించారు. స్వాతంత్ర సమరయోధులు, మొదటి కేంద్ర విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలామ్ 66వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులతో కలిసి బుధవారం పార్టీ కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో పత్రిక స్థాపించి ప్రజలను చైతన్యవంతం చేసి దేశానికి స్వాతంత్ర సాధించటంలో తనవంతు కృషి చేశారన్నారు. దేశంలో ఐఐటీలు, యూనివర్సిటీలు, గ్రాంట్స్ కమిషన్ తీసుకొచ్చి ఆరోజే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పునాది వేశారన్నారు. అబుల్ కలామ్ కలలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా విద్యపై దృష్టిసారించి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, జిల్లా మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌భాషా, నాయకులు కరిముల్లా, సిలార్, జిలాని, వరవకట్ట బుజ్జి, జాఫర్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ రుణాలతో బడుగులకు అభ్యున్నతి

**జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు**



శావల్యాపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయంలో సొసైటీలు అభ్యున్నతిలో పయనిస్తున్నాయని జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా వినుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో రూ.130 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. వేల్పూరు గ్రామంలో రూ. 6 కోట్లు వ్యయంతో రాష్ట్రస్థాయిలో తొలిసారిగా మొదట శీతల గిడ్డంగి కేంద్రం పనులు తుదిదశకు చేరాయని మూడు నెలలు వ్యవధిలో ప్రారంభోత్సవం చేస్తామన్నారు. సొసైటీ సారథ్యంలో త్వరలో బొల్లాపల్లి, కారుమంచి గ్రామాల్లో పెట్రోలు బంకులు ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం చేపడతామన్నారు. ఈపూరు మండలం అంగలూరులో త్వరలో పెట్రోలు బంకు ప్రారంభోత్సవం చేస్తామన్నారు. జిల్లాలో 25 వేల ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారికి ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున సొసైటీ ద్వారా రుణాలు ఇవ్వటానికి రంగం సిద్ధం చేశామన్నారు. ఆయనతో పాటు సొసైటీ బ్యాంకు మేనేజరు బత్తుల బాలకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, సీఈవోలు జాలాది నాగప్రసాదు, కన్నెదారి కోటేశ్వరరావు ఉన్నారు.

# ఉద్యాన పంటలు లాభదాయకం

- వాటిపై దృష్టి సారించాలి
- అగ్రిమిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి
- ఉప్పలపాడులో డ్రాగన్ ఫ్రూట్ పంట పరిశీలన




ఉప్పలపాడులో డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న ఎంవీఎస్ నాగిరెడ్డి

నరసరావుపేట రూరల్: ఉద్యాన పంటలు లాభదాయకమనీ, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి సూచించారు. మండలంలోని ఉప్పలపాడు సమీపంలో సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను బుధవారం ఆయన పరిశీలించారు. పంట సాగు చేస్తున్న విధానం, సాగుకు అవుతున్న ఖర్చు, సాగులో మెలకువలు, ఉద్యాన శాఖ అధికారులు అందిస్తున్న సహకారంపై రైతు షేక్ సాంబశివరావుతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఉద్యానవన పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి వనరులు అందుబాటులోకి వస్తున్నందున వరి సాగు విస్తీర్ణం రోజురోజుకు పెరుగుతోందన్నారు. ధాన్యానికి డిమాండ్ తక్కువగా ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయంగా లాభాలు వచ్చే ఉద్యాన పంటను సాగుచేయాలని సూచించారు. ఉద్యాన పంటలకు ఆంధ్రప్రదేశ్ హబ్‌గా ఉందన్నారు. రాయలసీమ నుంచి గుంటూరు జిల్లా మెట్ట ప్రాంతం వరకు ఉద్యాన పంట సాగుకు అనువైనదిగా ఉందని తెలిపారు. గత మూడేళ్లలో 1.43 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగును నూతనంగా ప్రారంభించడం జరిగిందన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ ద్వారా దానిమ్మ, బొప్పాయి, మామిడి, జీడి మామి డి తదితర పంటల సాగు చేస్తున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా ఆంధ్రప్రదేశ్ పంట ఉత్పత్తులను మనకు కనిపిస్తాయన్నారు. రైతులే శాస్త్రవేత్తలుగా మారి నూతన వ్యవసాయ విధానాలతో పంటల సాగు చేస్తున్నారని తెలిపారు. ఉప్పలపాడులో డ్రాగన్ ఫ్రూట్ సాగుచేస్తున్న రైతు సాంబశివరావు దీనికి ఉదాహరణగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ వడ్డే వీరాంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.

## వనికుంటలో హద్దురాళ్లు ఏర్పాటు



వనికుంటలో సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఈపూరు: మండలంలోని వనికుంట గ్రామంలో భూముల రీసర్వే అనంతరం పొలాలకు హద్దులను నిర్ధయించేందుకు రాళ్లను ఏర్పాటు చేయడం బుధవారం నుంచి ప్రారంభించారు. మండలంలో మొదటిసారిగా వనికుంట గ్రామంలో రీసర్వే పూర్తయినందున హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ రామావత్ వెంకటేశ్వర్లునాయక్ తెలిపారు. వనికుంట గ్రామంలో మొత్తం 1695 ఎల్‌పీఎం నంబర్లకు గాను హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో కూడా రీసర్వే పనులు పూర్తయిన వెంటనే హద్దురాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ చండీరాణి, వీఆర్‌వో నాసర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉరుసు మహోత్సవం

నాదెండ్ల: విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త ఒక్కడేనని, సాటి మానవుల సేవతోనే ఆ భగవంతుని ప్రసన్నత పొందవచ్చనేదే హజరత్ మహబూబ్ సుభాని బోధనల సారాంశమని దర్గా కమిటీ సభ్యులు చెప్పారు. అప్పాపురం గ్రామంలో కొలువైయున్న హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 15వ ఉరుసు మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించా రు. ఉరుసు మహోత్సవానికి గ్రామస్తులే కాక చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరి పారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యు లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భారీ అన్నదానం నిర్వహించారు. గురువారం ఉదయం గంధ మహోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## తిరునాళ్లలో నిబంధనలు తప్పనిసరి

ఈపూరు: మండలంలో రాబోయే తిరునాళ్లను నిబంధనలను పాటిస్తూ ప్రశాంతంగా ఎలాంటి గొడవలు లేకుండా జరుపుకోవాలని ఎస్ఐ విప్పర్ల వెంకట్రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా పొలిటికల్ బ్యానర్లను నిషేధించడమైందని, వీవీఐపీలు సాయంత్రం లోపు వచ్చి దర్శనం చేసుకొని వెళ్లేలా ఏర్పాటు చేయడమైందని, ప్రభలపైన కాని, వాటి వద్ద కాని రాజకీయ నాయకులు వచ్చి ప్రసంగించడానికి వీలు లేదన్నారు. ప్రభల మీద అశ్లీల నృత్యాలు నిషేధించడం జరిగిందని తెలిపారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటిస్తూ మండలంలో జరిగే ప్రతి తిరునాళ్లను విజయవంతంగా నిర్వహించుకోవాలని కోరారు.